క్లుప్తంగా

పోస్టర్లు, బ్యానర్లు తొలగించండి

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు నియోకవర్గంలో రాజకీయ పార్టీల నాయకుల ఫొటోలు, పేర్లు, పోస్టర్లు, పత్రికలు, ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.కౌసర్‌భాను ఆదివారం అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం 2024 సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిందని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నియోజకవర్గంలో పూర్తిగా అమలులోకి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా మసీద్ వార్షికోత్సవం



ఇఫ్తార్ విందులో గ్రామస్తులు

ప్రొద్దుటూరు: మండలంలోని కొత్తపేట గ్రామంలో మదీనా మసీద్ 21వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముసింలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

‘గేట్’లో మైదుకూరు విద్యార్థి సత్తా



రామధీరజ్

మైదుకూరు: ఇంజినీరింగ్ గేట్ ఎంట్రన్స్‌లో మైదుకూరుకు చెందిన గోశెట్టి రామధీరజ్ అనే విద్యార్థికి ఆల్ ఇండియా స్థాయిలో 31వ ర్యాంకు వచ్చింది. విద్యార్థి చెన్నైలో ఎలక్ట్రికల్ విభాగంలో ఇంజినీరింగ్ చదివాడు. రామధీరజ్ ఆల్ ఇండియా స్థాయిలో 31వ ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు రామచంద్రరావు, తల్లి విజయభారతి హర్షం వ్యక్తం చేశారు.

ఉచితంగా గుండె వైద్య పరీక్షలు

ప్రొద్దుటూరు క్రైం: స్థానిక లక్ష్యా కార్డియాక్, కంటి ఆస్పత్రిల్లో ఆదివారం ఉచితంగా గుండె, కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి గుండె వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఈసీజీ, స్కానింగ్ చేశారు. అలాగే డాక్టర్ హరిత 32 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో ప్రతి నెలా మూడవ ఆదివారం ఉచితంగా వైద్య శిబిరం నిర్వహిస్తారని చెప్పారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లోక్‌అదాలత్‌లో 341 కేసుల పరిష్కారం

బద్వేలు అర్బన్: లోక్‌అదాలత్‌లో భాగంగా బద్వేలు కోర్టు పరిధిలో 341 కేసులు పరిష్కారం అయ్యాయి. శనివారం కోర్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో 279 క్రిమినల్ కేసులు, 62 సివిల్ కేసులు మొత్తం 341 కేసులు పరిష్కరించినట్లు కోర్టు సిబ్బంది ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి ఆధ్వర్యంలో 341 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. వారు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులలో కక్షిదారులు తమ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌ల ద్వారా కేసులు పరిష్కరించుకోవడంతో సమయం,డబ్బు ఆదా అవుతుందని తెలిపారు.

పాదరక్షలు పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్: వైఎంఆర్ కాలనీలో యాచకులకు గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం పాదరక్షలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అభిమానులు రామారావు, జిలాన్, షరీఫ్, మధు, చిరురాయల్, చంద్రధర్, రాజు పాల్గొన్నారు.

కేజీబీవీలను ప్రభుత్వ పరిధిలోకి తీసుకురావాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రాజెక్టు పరిధిలో ఉన్న కేజీబీవీ పాఠశాలలను ప్రభుత్వ పరిధిలోకి తీసుకరావాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి నూతనంగా 90 కేజీబీవీ పాఠశాలలు మంజూరయ్యాయని, ఆటి నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వ పరిధిలోకి తీసుకోచ్చి కేజీబీవీ సిబ్బందిపా ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. కేవీబీవీ వ్యవస్థ ప్రారంభమైన్పటి నుంచి వేలాది ఉపాధ్యాయులు ఇందులో విధులు నిర్వహిస్తున్నారన్నారు.

ఆటా-పాట అదుర్స్

కడప కల్చరల్ : ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా చిన్నారులు తమ నృత్యాలతో అలరించారు. స్థానిక విజిల్స్ డ్యాన్స్ అకాడమీఆధ్వర్యంలో కడప శిల్పారామంలో జరిగిన కార్యక్రమంలో సినిమా పాటలు, జానపద నృత్యాలతో ఆకట్టుకున్నారు. సందర్శకులు అడుగడుగునా ప్రోత్సహిస్తూ కరతాళ ధ్వనులు చేశారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

- టీడీపీ కుట్రలను తిప్పికొట్టండి
- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపు



బూత్ కన్వీనర్లకు ప్రచార సామాగ్రిని అందజేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపునిచ్చారు. ఆదివారం నెల్లూరు రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బద్వేలు మున్సిపాలిటీ బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో నిర్వహించిన నేను సిద్ధం - నా బూత్ సిద్ధం కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈ ఎన్నికలను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుని సైనికుల్లా పని చేయాలని సూచించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కోరారు. టీడీపీ కూటమి మోసపూరిత హామీలు, అసత్య ప్రచారాలను ఎండగట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, కేశవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరాములు, వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్లు గోపాలస్వామి, సాయికృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, కౌన్సిలర్లు సత్యనారాయణ, నాగేశ్వర్‌రావు, రామచంద్రారెడ్డి, సాంబశివారెడ్డి, ఎంఆర్ ఎఫ్‌రమణారెడ్డి,రజనీకాంత్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వివరించండి

పోరుమామిళ్ల: ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు చురుగ్గా పనిచేయాలని, ఓటర్లను కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, నియోజకవర్గ బూత్‌ల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, పీఆర్‌ఆర్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బ్రెస్ట్ బ్రెయాన్ అనాధాశ్రమ ఆవరణలో జరిగిన 43 బూత్‌లకు చెందిన కోర్ కమిటీ మెంబర్లు, బూత్ మేనేజర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలు గుర్తు చేస్తూ.. మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి అయితే జరిగే మేలు వివరించాలని సూచించారు. ఈ నెలన్నరలో ఓటర్ల సంఖ్య పెంచాలని, అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేలా విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో కల్లూరు రమణారెడ్డి, యువనేత డీసీ ఆదిత్యారెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ రాజశేఖర్, సర్పంచులు చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, కె. రమణారెడ్డి, ఉపసర్పంచ్ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



బాలకృష్ణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ, పార్టీ నాయకులు

రైతు కుటుంబానికి న్యాయం చేస్తాం

మండలంలోని టేకూరుపేట పంచాయతీ బాలిరెడ్డిపల్లెకు చెందిన శెట్టి బాలకృష్ణ (46) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే విషయం తెలుసుకున్న డీసీ గోవిందరెడ్డి ఆదివారం ఉదయం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో బాలకృష్ణ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. జగనన్న విద్యా దీవన, అమ్మ ఒడి తదితర పథకాల ద్వారా పిల్లల చదువు పూర్తయ్యేందుకు సహకరిస్తామని భరోసా ఇచ్చారు. మృతునికి భార్య నాగేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాలకృష్ణ మరణంతో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది.

ప్రస్తుత సమాజానికి అద్దం ‘మౌమితా ఆలం’ కవిత్వం



సమావేశంలో మాట్లాడుతున్న మహమూద్

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రస్తుత సమాజంలో రాజకీయ, సామాజిక పరిణామాలకు మౌమితా ఆలం కవిత్వం అద్దం పడుతోందని కవి మహమూద్ పేర్కొన్నారు. బెంగాల్‌కు చెందిన మౌమిత ఆలం ఆంగ్లంలో రచించిన కొన్ని కవితలను విరసం సభ్యుడు ఉదయమిత్ర తెలుగులోకి ‘రాయకూడని పద్యం’ పేరుతో పుస్తక రూపంలో తీసుకొచ్చారు. ఆదివారం జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో మిత్రజ్యోతి సాహితీ సంస్థ, జనవిజ్ఞాన వేదిక సంయుక్తంగా పుస్తక పరిచయ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వలన ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆ సమస్యలను మౌమిత ఆలం ఆంగ్లంలో రచిస్తే ఉదయమిత్ర తెలుగులో అనువదించి పాఠకులకు అందించారని పేర్కొన్నారు. బీజేపీ పాలన, మత, కుల, ఛాందస వాదాన్ని పెంచి పోషిస్తోందని, దేశ బహుళ సంస్కృతిని విచ్ఛిన్నం చేసేలా పాలిస్తోందని విమర్శించారు. విరసం మాజీ కార్యదర్శి వరలక్ష్మి మాట్లాడుతూ నేటి సమాజంలో దళితులు, ప్రజలు, వలస కార్మికులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను మౌమిత ఆలం కవిత్వ రూపంలో రాశారని తెలిపారు. ప్రజల తరపున ప్రశ్నించే రచయితలు, మేధావులపై తప్పుడు కేసులు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పుస్తకాన్ని అందరూ చదవాలని సూచించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, చైతన్య మహిళా సంఘం సభ్యురాలు పద్మ, సాహితీ వేత్త దాదాహయత్, రచయిత జింకా సుబ్రహ్మణ్యం, సురేష్, రాంగోపాల్, అక్షత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శిగా సుబ్బారెడ్డి



నియామక పత్రాన్ని ఎమ్మెల్సీ చేతుల మీదుగా అందుకుంటున్న సుబ్బారెడ్డి

అట్లూరు : వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన సంఘం ప్రధాన కార్యదర్శిగా బండి వెంకటసుబ్బారెడ్డిని అధిష్టానం నియమించింది. అట్లూరు మండలం కొత్తకోటపాడుకు చెందిన వెంకట సుబ్బారెడ్డికి పార్టీలో సముచిత స్థానం కల్పించాలని అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో పోరుమామిళ్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం సుబ్బారెడ్డికి నియామకపత్రం అందజేశారు. నాయకులు బాలకృష్ణారెడ్డి ఉన్నారు.

ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి అభినందనల వెల్లువ



ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చాపాడు: త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైదుకూరు నియోజకవర్గ అభ్యర్థిగా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని ప్రకటించటం పట్ల ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.

పర్యావరణంపై అవగాహన ర్యాలీ

వైవీయూ : పెండ్లిమర్రి మండలం మిట్టమీదపల్లెలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఆదివారం పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్-4 ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా.సునీత మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగంద్వారా జరిగే పరిణామాలపై అవగాహన కల్పించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

కడప కల్చరల్ : విద్యార్థులు కష్టపడి చదివి భావి భారత విద్యార్థులకు ఆదర్శంగా నిలబడాలని బద్వేలు ఫాతిమా చర్చి రెవరెండ్ ఫాదర్ గొడుగునూరు విజయరావు, మాసాపేట పునీత యోహాన్ చర్చి రెవరెండ్ ఫాదర్ గుడిమే దేవ సహాయం, ఆరోగ్యమాత పుణ్య క్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ఎండి.ప్రసాదరావులు పిలుపునిచ్చారు. కడప నగరంలోని శాంతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం పెన్నులు, అట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చరిత్రలో గొప్ప వారిగా చెప్పుకొనే ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడి ముందుకు వెళ్లారని, అలాంటి వారిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. శాంతి సేవా సొసైటీ చిన్నపాటి స్వచ్ఛంద సేవా సంస్థ అయినప్పటికీ వారి సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. విద్యార్థులకు చదువు పట్ల భయాన్ని పొగొట్టేలా అవగాహన సదస్సులు నిర్వహించాలని వారు సూచించారు.

మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి



మీటర్ రీడర్ల యూనియన్ నూతన కమిటీ

ప్రొద్దుటూరు: విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యానారాయణ, కార్యదర్శి విజయకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మీటర్ రీడర్ల యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీటర్ రీడర్లకు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. అనంతరం మీటర్ల రీడర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్.ప్రసన్న కుమార్, ప్రధాన కార్యదర్శిగా బాలసుబ్బయ్య కోశాధికారిగా సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా డి.ఓబులేసు, సుధాకర్, కిరణ్, సహాయ కార్యదర్శిగా గోపాల్‌రెడ్డి, కార్యదర్శులుగా సుబ్బరాయుడు, శివ, ప్రసాద్, కమిటీ సభ్యులు సురేష్, కృష్ణతో పాటు 13 మందిని ఎన్నుకున్నారు.

ఎలక్టోరల్ బాండ్లతో ప్రజాస్వామ్యానికి ప్రమాదం

కడప ఎడ్యుకేషన్ : ఎలక్టోరల్ బాండ్ల రూపంలో వందల కోట్ల రుపాయలు రాజకీయ పార్టీలు పొందడం , తదుపరి తాము అధికారంలోకి వచ్చినప్పుడు తమకు విరాళంగా ఇచ్చిన సంస్థలకు మేలు చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదంమని అభ్యుదయ వేదిక రాష్ట్ర నాయకులు సురేష్ బాబు పేర్కొన్నారు. అఖిల భారత అభ్యుదయ వేదిక కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎలక్టోరల్ బాండ్ల అంశంపై ఆదివారం చర్చా వేదిక జరిగింది. ఈ సమావేశంలో సురేష్‌బాబు ఆమాట్లాడుతూ ఆర్థిక బలంతో ఎన్నికలలో ప్రత్యర్థులను అనైతిక పద్ధతుల్లో ఓడించడం ద్వారా ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచి నట్టేనని అన్నారు. అభ్యుదయ వేదిక జిల్లా అధ్యక్షుడు బొంగాని విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి శంకరయ్యలు మాట్లాడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగించే ఎలెక్టోరల్ బాండ్ల విధానం సమర్థనీయం కాదన్నారు. ప్రస్తుతం సామాన్యులు ఎన్నికలలో గెలవడమనేది అసాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహబూబ్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

మీ బిడ్డ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించండి

కొండాపురం : జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మీ బిడ్డ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ప్రొద్దుటూరు ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని చామలూరు పునరావాస కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధీర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో పేదల కోసం పార్టీలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందించాడన్నారు. టీడీపీ నాయకులు చెప్పే మోస పూరిత హామీలు ఎవరు నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు చింత రాజారెడ్డి, రాష్ట్ర కనీస వేతనాల సలహా చైర్మన్ ఒంటెద్దు రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు రాఘవేంద్రరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి నిరోధకులకు ఓటుతో బుద్ధిచెప్పాలి

- ఆలోచించి ఓటేయండి
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డికి స్వాగతం పలుకుతున్న అభిమానులు

ప్రొద్దుటూరు: మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అభివృద్ధి నిరోధకుడని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి విమర్శించారు. అభివృద్ధి సాధకుడా.. లేక అభివృద్ధి నిరోధకుడా ఎవరు కావాలో ప్రజలే నిర్ణయించాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డులో కౌన్సిలర్ కొవ్వూరు స్వాతి కృష్ణచైతన్యరెడ్డి, సీనియర్ నాయకులు కొవ్వూరు రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే రాచమల్లు దంపతులు ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 25 ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా ఉన్న వరదరాజులరెడ్డి అభివృద్ధి నిరోధకుడుగా ముద్ర వేసుకున్నారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కూరగాయల మార్కెట్, పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణం, ఆర్టీసీ బస్టాండ్, పైపులైన్, మురుగునీటి కాలువల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేస్తే అసంపూర్తిగా ఉన్న పనులు ఆగిపోకుండా పూర్తవుతాయని తెలిపారు.

ఆలోచించి ఓటేయండి

85 ఏళ్ల వయసులో వరదరాజులరెడ్డిని టీడీపీ అభ్యర్థిగా నిలిపిందని, ఈ వయసులో ప్రజా సమస్యలు విని పరిష్కరించే ఓపిక ఉండదని, ఈ వయసు విశ్రాంతి తీసుకునే వయసు అని రాచమల్లు అన్నారు. వివేకవతులైన ఓటర్లు ఆలోచించి ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రెండేళ్లు కరోనా వచ్చిందని, మిగతా మూడేళ్లలో చెప్పుకోతగ్గ అభివృద్ధి సాధించామన్నారు. ప్రచారంలో పి.నరసింహులు, పి.ప్రసాద్, పి.రాజు, పి.శ్రీకాంత్, ఎంపీటీసీ బోస్, బాబు, పటేల్, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి నాగరాజు, వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి, మాజీ కౌన్సిలర్ పాతకోట కృష్ణవేణి, అగస్త్యేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రఘురామిరెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, అరసం జిల్లా అధ్యక్షుడు నాగులారపు విజయసారథి, జయసింహా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శులు పోరెడ్డి నరసింహారెడ్డి, పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

లౌకికత్వానికి ప్రతిరూపాలు

దూదేకుల సామాజికవర్గానికి చెందిన వారు లౌకికత్వానికి ప్రతిరూపాలని రాచమల్లు శివప్రసాదరెడ్డి కొనియాడారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని మైదానంలో ఆదివారం ప్రొద్దుటూరు నియోజకవర్గ నూర్ బాషా దూదేకుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దూదేకుల సామాజికవర్గంతో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. వీరికి కావాల్సిన వాటిని సమకూర్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ సామాజికవర్గంలో ఆణిముత్యాల్లాంటి వారు జన్మించారని గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాయని తెలిపారు. రూ.120 కోట్ల మున్సిపల్ నిధులతో మౌలిక వసతులు కల్పించామని, రోజూ తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డికి ఓట్లు వేసి మెజార్టీతో గెలిపించాలని కోరారు. నూర్ బాషా దూదేకుల సంఘం రాష్ట్ర నాయకుడు నూర్ అహ్మద్ మాట్లాడుతూ మదరసాలో ఉచిత మధ్యాహ్న భోజనం, ఇమాంలకు గౌరవ వేతనం, ఆడబిడ్డల పెళ్లికి రూ.లక్ష జగన్ ప్రభుత్వం సహాయం అందించిందన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. సమావేశంలో నూర్ బాషా దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ రసూల్ నూర్ బాషా, సంఘం ప్రొద్దుటూరు అధ్యక్షుడు చెరుకూరు నాగూర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పగిడాల దస్తగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, నూర్ బాషా దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.ఓబులేసు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మస్తానమ్మ, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు నూర్ మహ్మద్, కోట వీధి రమేష్, పులివెందుల మహ్మద్ రఫి, సుభాన్‌బీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ప్రొద్దుటూరు డివిజన్‌లో 70 పరీక్షా కేంద్రాలు

ప్రొద్దుటూరు కల్చరల్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని 18 మండలాలకు సంబంధించి 70 పరీక్షా కేంద్రాల్లో 14,113 మంది రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రొద్దుటూరు మండల పరిధిలో 4,149 విద్యార్థులకు గాను 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. దొరసానిపల్లె, ఖాదరబాద్ జిల్లాపరిషత్ హైస్కూల్, గోపీకృష్ణ, ఎస్‌బీఎమ్, నారాయణ, వైఎంఆర్‌కాలనీ, బొల్లవరం, రాజేశ్వరి కాలనీలోని శ్రీ చైతన్య మూడు పాఠశాలలు, నారాయణ, గౌతమ్, సెయింట్ జోసఫ్ హైస్కూల్, రమణ మహర్షి, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్, వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్, రామేశ్వరం ఎస్‌పీసీఎస్, నడింపల్లి, మోడంపల్లి, ఉర్దూ హైస్కూల్, కొత్తకొట్టాల, 2వ వార్డు, వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షల సమయంలో పరీక్ష కేంద్రం చీఫ్ ఆఫీసర్, డిపార్టుమెంటల్ ఆఫీసర్, ఇన్విజిలేటర్‌తో పాటు ఏఎస్‌ఎంలకు పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్ అనుమతి లేదు. పరీక్షా కేంద్రాల్లో బెంచీలకు హాల్ టికెట్ నంబర్లు వేయయడంతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.

పరిశీలించిన అధికారులు

చాపాడు: మండలంలోని చాపాడు, లక్ష్మీపేట జిల్లా పరిషత్ పాఠశాల్లోని పరీక్షా కేంద్రాల్లో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి రవిశంకర్ తెలిపారు. మండల వ్యాప్తంగా 427 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, చాపాడు పరీక్షా కేంద్రంలో 300 మంది, లక్ష్మీపేట పరీక్షా కేంద్రంలో 127 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయఘటనలు జరుకుండా 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు మండల తహసీల్దారు భూషణం తెలిపారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అట్లూరులో..

అట్లూరు: పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి విలియంరాజు పేర్కొన్నారు. అట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కమలకూరు, సోమేశ్వరపురం ఉన్నత పాఠశాలలతో పాటు అమృతసాయి ఉన్నత పాఠశాల, కస్తూరిభాగాంధీ బాలికల పాఠశాలల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

ఓటు వేయడం అందరి బాధ్యత

వైవీయూ : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు వేయడం బాధ్యతగా భావించాలని పలువురు వక్తలు సూచించారు. కడప నగరంలోని ఐఎంఏ సమావేశ మందిరంలో బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ‘నా ఓటు-నా హక్కు’ అంశంపై ఆదివారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల పవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని అవినీతి రహిత సమాజం కోసం కృషిచేయాలన్నారు. రాజనీతి శాస్త్ర విశ్రాంత అధ్యాపకులు రాటాల గోపి మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే డబ్బు తీసుకోకుండా ఓటు వేయడంతోపాటు అభివృద్ధి కాంక్షించే నాయకులను ఎన్నుకోవాలని సూచించారు.

కండక్టర్ కుసుమకుమారి మృతి బాధాకరం

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఏపీఎస్సార్టీసీ కడప డిపో కండక్టర్ కుసుమకుమారి గుండెపోటుతో మృతి అత్యంత బాధాకరమని ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ సెక్రటరి ఏఆర్.మూర్తి, కడప డిపో అధ్యక్ష, కార్యదర్శులు రాము, బాలవెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుసుమకుమారి తన 25 ఏళ్ల సర్వీసులో ఒక్క తప్పు కూడా చేయలేదని, తప్పు చేసిందని ఆమెపై ఇపుడు అభియోగం మోపారన్నారు. ఈ నెల 5న 87 మంది ప్రయాణికులతో వెళ్తున్న రాజంపేట-కడప లాస్ట్ సింగిల్ సర్వీసులో రూ. 20 వేలు తీసుకుని టిక్కెట్ ఇవ్వలేదని తనిఖీ అధికారులు కేసు నమోదు చేశారన్నారు.